## గోదావరి నదిలో డీసిల్టేషన్ ప్రక్రియ
# ప్రభుత్వం విరమించుకోవాలి...


3లో

www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

గురువారం 6, ఆగస్టు, 2026 8 పేజీలు

## ఇందిరమ్మ ఇండ్ల సర్వేను
# వేగవంతంగా పూర్తిచేయాలి

భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్

భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 5 (భద్రాద్రిన్యూస్ ): జిల్లావ్యాప్తంగా రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రక్రియలో భాగంగా చేపడుతున్న పూరి గుడిసెలు, అర్హులైన లబ్ధిదారుల సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఎంపీడీవోలు, తహసీల్దార్లు, గృహ నిర్మాణ శాఖ అధికారులు, మండల స్థాయి సిబ్బందితో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ఇందిరమ్మ ఇండ్ల సర్వే, పూరి గుడిసెల సర్వే పురోగతిపై సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా సర్వే ప్రగతిని పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న..


2 లో..

## విద్యార్థులకు సైబర్ నేరాలపై
# అవగాహన

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు


2 లో..

కొత్తగూడెం అర్బన్ ,ఆగస్టు 5 (భద్రాద్రిన్యూస్ ):- తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో హైదరాబాద్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య మాసం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న “సురక్ష కా తిరంగా -- సైబర్ స్వతంత్ర తెలంగాణ” సైబర్ అవగాహన ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం కొత్తగూడెంలోని సింగరేణి ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు సైబర్ భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.



## “స్టే అలర్ట్ - స్టే అవేర్ - స్టే సైబర్ సేఫ్”
# విద్యార్థులకు ఎస్ పి పిలుపు

ములుగులో సైబర్ భద్రతపై 500 మంది విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

సైబర్ నేరాలపై అవగాహన కల్పించడమే లక్ష్యం - జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామ్‌నాథ్, ఐపీఎస్


3లో

# అంగన్వాడీ కేంద్రాల్లో తీవ్ర నిర్లక్ష్యం..?



2లో

తాళం వేసి దర్శనమిస్తున్న కేంద్రాలు..

పోషకాహారం అందడం లేదు

అధికారుల పర్యవేక్షణపై గ్రామ పంచాయతీ సభలో ఆగ్రహం

ఏటూరునాగారం, భద్రాద్రి న్యూస్ : ఏటూరునాగారం మండలంలోని పలు అంగన్వాడీ కేంద్రాల పనితీరుపై గ్రామస్తులు, మహిళా సంఘాల నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ సభలో అంగన్వాడీ కేంద్రాలు సక్రమంగా నిర్వహించడం లేదని, చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు ప్రభుత్వం

# ఇందిరమ్మ ఇండ్ల సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలి

మొదటి పేజీ తరువాయి

దరఖాస్తులు, క్షేత్రస్థాయి పరిశీలన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు సర్వేను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి అర్హ కుటుంబం సర్వేలో నమోదయ్యేలా ఇంటింటికీ వెళ్లి సమగ్ర వివరాలను సేకరించాలని, అర్హత ప్రమాణాలను నిశితంగా పరిశీలించి నివేదికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. సర్వేలో ఎలాంటి లోపాలు, పొరపాట్లు లేకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. మండలాల వారీగా ఎల్-1, ఎల్-2, ఎల్-3 కేటగిరీలలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్న కలెక్టర్, వాటిని ప్రాధాన్యత ఆధారంగా వెంటనే పరిశీలించి సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. పెండింగ్‌కు గల కారణాలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని, ప్రతిరోజూ సర్వే పురోగతిని పర్యవేక్షిస్తూ నిర్ణీత లక్ష్యాలను సాధించాలని సూచించారు.

సర్వే ప్రక్రియలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని, గ్రామస్థాయిలో ఎటువంటి సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరించి పనులు నిరాటంకంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకం చేరేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.సర్వే పనులను ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పూర్తిచేయాలని, సర్వేలో ఎలాంటి నిర్లక్ష్యం, అలసత్వం లేదా జాప్యానికి తావు ఉండరాదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాణ్యత, పారదర్శకత, వేగం అనే మూడు అంశాలను దృష్టిలో ఉంచుకుని సర్వేను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు.

# విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన





మొదటి పేజీ తరువాయి

ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థినులకు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని వివరించారు.

ఈ సందర్భంగా ప్రస్తుతం ఎక్కువ జరుగుతున్న డిజిటల్ అరెస్ట్, స్టాక్ మరియు బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్, లోన్ యాప్ మోసాలు, సోషల్ మీడియా మోసాలు, ఏపీకే ఫైళ్ల ద్వారా జరిగే సైబర్ నేరాలు, మ్యూల్ బ్యాంక్ అకౌంట్ల వినియోగం వంటి సైబర్ మోసాల గురించి ఎస్పీ ఉదాహరణలతో విద్యార్థినులకు వివరించారు. తక్కువ సమయంలో అధిక లాభాలు, ఉద్యోగ అవకాశాలు, సినిమా అవకాశాలు, తక్కువ వడ్డీ రుణాలు వంటి ఆకర్షణీయమైన ఆఫర్లను నమ్మి వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు పంచుకోవద్దని సూచించారు.

అదేవిధంగా సైబర్ భద్రతపై అవగాహన కల్పిస్తూ, డిజిటల్ లావాదేవీల్లో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ సంస్థల పేరుతో వచ్చే అనుమానాస్పద ఫోన్ కాల్స్, వీడియో కాల్స్, ఓటిపిలు, కేవైసీ అప్‌డేట్, లోన్‌లు లేదా రివార్డుల పేరుతో వచ్చే సందేశాలను గుడ్డిగా నమ్మవద్దన్నారు. బ్యాంకు ఖాతా వివరాలు, గోప్యమైన సమాచారాన్ని ఎవరికీ వెల్లడించరాదని తెలిపారు.

సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్ కు కాల్ చేసి ఫిర్యాదు నమోదు చేయాలని, సకాలంలో ఫిర్యాదు చేస్తే నష్టపోయిన నగదును తిరిగి పొందే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని తెలిపారు. అలాగే విద్యార్థులు మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబం, సమాజంపై కూడా తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని వివరించారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత ప్రమాణాలు పాటించాలని ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, సీటు బెల్ట్ ధరించాలని, అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ, సైబర్ సెల్ సిఐ జితేందర్, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్, సైబర్ సెల్ పోలీసు అధికారులు, సిబ్బంది మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

# బిజెపి ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా

**ఆగస్టు 15న భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల్లో దేశభక్తిని,**

**జాతీయ జెండా పట్ల గౌరవాన్ని పెంపొందించాలి**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిజెపి అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి...**

**ముఖ్యఅతిథిగా విచ్చేసిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిజెపి ఇన్చార్జి డాక్టర్ విజయ్ చందర్ రెడ్డి**






**కొత్తగూడెం అర్బన్ ,ఆగస్టు5 ( భద్రాద్రి న్యూస్):-**

"కొత్తగూడెం" 5వ తేదీ బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవి పల్లి లో గల భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన భారతీయ జనతా పార్టీ కేంద్ర మరియు రాష్ట్ర పార్టీల పిలుపుమేరకు "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. కార్యక్రమాన్ని ఉద్దేశించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, జిల్లా ఇన్చార్జి డాక్టర్ విజయ్ చందర్ రెడ్డి మాట్లాడుతూ...

ప్రతి ఇంటింటిపై జాతీయ జెండా ఆవిష్కరణ దేశంలోని ప్రతి పౌరుడు తమ ఇళ్లు, వ్యాపార సముదాయాలు, ఆఫీసులపై మువ్వన్నెల జెండాను గౌరవప్రదంగా ఎగురవేసేలా ప్రోత్సహించాలని ప్రజలలో జాతీయ పతాకంతో ఉన్న బంధాన్ని మరింత బలోపేతం చేయాలని. భారతీయ జనతా పార్టీ యువమోర్చా పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో పట్టణాలు, గ్రామాలు, అసెంబ్లీ నియోజకవర్గాల్లో తిరంగా యాత్రలు నిర్వహించాలని. ప్రజాప్రతినిధులు, నాయకులు స్వయంగా ఈ ర్యాలీలలో పాల్గొని ప్రజలను భాగస్వాములను చేయాలని. జాతీయ జెండాతో దిగిన సెల్ఫీలను అధికారిక సోషల్ మీడియా వేదికల ద్వారా దేశవ్యాప్తంగా ప్రచారం చేయాలని,

పార్టీ కార్యకర్తలు ప్రతి బూత్ స్థాయిలో ఇళ్లను సందర్శించి పౌరులకు జెండాలను పంపిణీ చేయడం మరియు అవగాహన కల్పించడం. కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేయడం.

వందేమాతరం ఆలపన స్థానికంగా దేశభక్తి సభలు, అమరవీరులకు నివాళులర్పించడం, ఎన్జీవోస్ కి, సేవా రంగంలో పేరు ప్రఖ్యాతలు పొందిన వారికి సన్మానం, కార్యక్రమాలు నిర్వహించాలని ఈ సందర్భంగా చెప్పడం జరిగింది.

ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా స్థాయి నాయకులు, మండల స్థాయి నాయకులు, మోర్చా పదాధికారులు, బిజెపి కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాల్లో తీవ్ర నిర్లక్ష్యం..?



మొదటి పేజీ తరువాయి

అందించాల్సిన పోషకాహారం సకాలంలో అందడం లేదని ఆరోపించారు. ప్రజా సంఘాల నాయకులు గ్రామస్తుల కథనం ప్రకారం, కొన్ని అంగన్వాడీ కేంద్రాలు తరచూ తాళం వేసి కనిపిస్తుండగా, మరికొన్ని కేంద్రాల్లో ఆయాలు మాత్రమే ఉండి టీచర్లు విధులకు హాజరుకావడం లేదని ఆరోపిస్తున్నారు. ఒక కేంద్రంలో వారం రోజులుగా టీచర్ విధులకు రాకపోవడంతో ఆయా ఇద్దరు చిన్నారులతో మాత్రమే కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. బుధవారం పలు అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించిన మాల సామాజిక న్యాయ వేదిక ములుగు జిల్లా అధ్యక్షుడు గంపల శివకుమార్ మాట్లాడుతూ, అనేక కేంద్రాల్లో టీచర్లు అందుబాటులో లేరని, కొన్ని కేంద్రాలు పూర్తిగా తాళం వేసి ఉన్నాయని ఆరోపించారు. పాప్కాపురం గ్రామ అంగన్వాడీ కేంద్రం కూడా సక్రమంగా పనిచేయడం లేదని, అక్కడ టీచర్, ఆయా లేక కేంద్రం మూతపడినట్లు స్థానికులు పేర్కొన్నారని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు వేడి భోజనం, గుడ్లు, పాలు, ఇతర పోషకాహార పదార్థాలు, గర్భిణీలు, బాలింతలకు ప్రభుత్వం అందించే పోషకాహార సరఫరా సక్రమంగా జరుగడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గ్రామస్తుల ఆరోపణల ప్రకారం, ఐసీడీఎస్ కార్యాలయంలో అధికారులు అందుబాటులో లేకపోవడం, కంప్యూటర్ ఆపరేటర్ మాత్రమే ఉండడం, అధికారులు మొక్కుబడిగా తనిఖీలు చేసి వెళ్లిపోతున్నారని విమర్శించారు. తల్లిపాల వారోత్సవాలు వంటి కార్యక్రమాలు కూడా కేవలం ఫోటోలకే ప రి మి ం త మ ం వ్ తు ం న్నా య ం ని ఆరోపించారు.అంగన్వాడీ వ్యవస్థలో గతంలో జరిగిన పదోన్నతులు, బదిలీలపై కూడా గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో జిల్లా కలెక్టర్ అక్రమ నియామకాలు, బదిలీలను రద్దు చేసినప్పటికీ, అనంతరం నిబంధనలకు విరుద్ధంగా పదోన్నతులు, బదిలీలు జరిగాయని ఆరోపిస్తూ సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర



మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) స్వయంగా అంగన్వాడీ సేవలను మెరుగుపరచాలని, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం అందించాలని అధికారులకు పలు సూచనలు చేసినప్పటికీ, వాటి అమలులో నిర్లక్ష్యం కొనసాగుతోందని గ్రామస్తులు ఆరోపించారు.

అంగన్వాడీ కేంద్రాల పనితీరుపై జిల్లా యంత్రాంగం వెంటనే సమగ్ర విచారణ చేపట్టి, విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకోవాలని, ప్రతి కేంద్రం ప్రతిరోజూ సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, ప్రజాసంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత ప్రజా సంఘాలు. నాయకులు మహిళలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి నదిలో డీసిల్టేషన్ ప్రక్రియ ప్రభుత్వం విరమించుకోవాలి...

**మండల వ్యాప్తంగా గోదావరి నది ఒడ్డుకు కరకట్ట నిర్మించాలి**

**రైతులకు ఎరువుల సప్లై పాత పద్ధతిలో చేపట్టాలి**

**యాప్ లను రద్దు పరచాలి**

**వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు మెమోరాండం అందజేసిన సిపిఎం**

**భద్రాద్రి న్యూస్ వెంకటాపురం :** మండలంలోని గోదావరి నదిలో సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ పేరుతో చిన్న సన్నకారు గిరిజన రైతాంగానికి నష్టం వాటిల్లే డీసిల్టేషన్ ( పూడికతీత ) రాష్ట్ర ప్రభుత్వం రద్దు పరచుకోవాలని, తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావుకు . బుధవారం నాడు సిపిఎం పార్టీ బృందం మెమోరాండం అందజేసింది ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి మాట్లాడుతూ ఎదిర, సూరవీడు, భోధాపురం, ఆలుబాక, గ్రామపంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు సంబంధించిన సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ నిల్వ సామర్థ్యం పెంచటానికి వెంకటాపురం మండలంలోని గోదావరి నదిలో సుమారు 15 కిలోమీటర్ల విస్తీర్ణంలో 4 ఎకరాలలో సుమారు ఐదు కోట్ల క్యూబిక్ మీటర్ల ఇసుకను తొలగించడానికి, ఇసుక మాఫియా, జిల్లా అధికారులు కుమ్మక్కై మండల రైతాంగానికి తీవ్ర నష్టం చేసేందుకు రంగం సిద్ధం చేశారని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు, గత నాలుగు సంవత్సరాలుగా ఆగిపోయిన సీతమ్మ సాగర్ ప్రాజెక్టు, 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న వెంకటాపురం మండలంలో డీసిల్టేషన్ ఎవరి ప్రయోజనం కోసమో ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు, ఒకవైపు సీతమ్మ సాగర్ ప్రాజెక్టు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ కోర్టులో తదుపరి తీర్పు పెండింగ్ లో ఉందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు, నాలుగు వేల కోట్లతో ప్రారంభం మించిన సీతమ్మ సాగర్ ప్రాజెక్టు 1600 కోట్ల పని మాత్రమే జరిగిందని, ఈ ఏడాది కూడా రాష్ట్ర బడ్జెట్లో కేవలం 330 కోట్లు మాత్రమే కేటాయించారని, ప్రాజెక్టు పనులే పూర్తికాకుండా ఈ డీసిల్టేషన్ ఇసుక మాఫియా ముఠాను బాగు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తుందని అన్నారు, డీసిల్టేషన్ వలన ఒకవైపు పర్యావరణం దెబ్బతింటుందని, మరోవైపు భూగర్భ జలాలు అడిపోయి వ్యవసాయానికి సాగునీరు ప్రజలకు తాగునీరు సమస్యలు కూడా మండలంలో తలెత్తే పరిస్థితులు ఎదురవుతాయని అన్నారు, ఇప్పటికే మండలంలోవేలాది లారీలు ఇసుక రవాణా ద్వారా గడిచిన నాలుగు సంవత్సరాలుగా ప్రజలు ప్రయాణం నరకయాతన అనుభవిస్తున్నారని ఇసుక లారీల వల్ల ఏర్పడిన గుంతల వల్ల అనేకమంది ప్రమాదాలకు గురై మరణించిన సంఘటన కూడా మండలంలో ఉన్నాయన్నారు కొద్ది సంవత్సరాలుగా వస్తున్న తీవ్రమైన వరదలకు గోదావరి ఒడ్డు నుండే భూములు కోతకు గురవుతున్నాయని వందల సంఖ్యలో గోదావరి నదిలో భూములు కొట్టుకుపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు మండలంలో యాకన్న గూడెం గ్రామం నుండి సుడిబాక గ్రామం వరకు గోదావరి ఒడ్డుకు కరకట్టకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని, తద్వారా రైతాంగ జీవన ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు

రైతులకు ఎరువు బస్తాలు పాత పద్ధతులలో అందజేయాలని, యూరియా డిఏపి మరియు ఇతర ఎరువు బస్తాలకు యాపులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు చిట్టెం ఆదినారాయణ, కాపుల వెంకటేశ్వర్లు, తోట నాగేశ్వరరావు, సాదనపల్లి దేవి, సోలం రంగయ్య, గొంది రమణయ్య తదితరులు పాల్గొన్నారు

# కారేపల్లిలో మద్యం సిండికేట్‌పై ఫిర్యాదు

**ఎంఆర్పీకి మించి విక్రయాలపై ఎక్సైజ్‌కు మీడియా వినతి**

**బెల్ట్‌షాపులకు ఆటోల ద్వారా సరఫరాపైనా ఆరోపణలు.. తనిఖీలు నిర్వహిస్తామని ఎస్సై హామీ**




**కారేపల్లి, ఆగస్టు 5 (భద్రాద్రి న్యూస్ రాములు ):** కారేపల్లి మండలంలో మద్యం సిండికేట్‌గా వ్యవహరిస్తూ ఎంఆర్పీకి మించి ధరలకు మద్యం విక్రయిస్తున్నారనే ఆరోపణలపై 'అక్షరం ఆయుధం' మీడియా పాత్రికేయులు బుధవారం ఎక్సైజ్ శాఖ ఎస్సై డి. వసంతకు వినతిపత్రం అందజేశారు.

మండలంలోని పలు గ్రామాల్లో బెల్ట్‌షాపులు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయని, ఆటోల ద్వారా మద్యం సరఫరా చేస్తూ బాటిల్‌కు రూ.15 నుంచి రూ.40 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయించిన ఎంఆర్పీ ధరలను ఉల్లంఘిస్తూ వినియోగదారులపై భారం మోపుతున్నారని ఆరోపించారు. బెల్ట్‌షాపుల్లో అధిక ధరలపై ప్రశ్నిస్తే, సిండికేట్ సభ్యులే తమ వద్ద అదనపు మొత్తం వసూలు చేస్తున్నందున తామూ వినియోగదారుల నుంచి ఎక్కువ ధర తీసుకోవాల్సి వస్తోందని కొందరు నిర్వాహకులు చెబుతున్నట్లు ప్రజలు పేర్కొంటున్నారని వివరించారు.

మద్యం సిండికేట్ కార్యకలాపాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని, ఆటోల ద్వారా జరుగుతున్న అక్రమ మద్యం రవాణా, బెల్ట్‌షాపుల నిర్వహణ, ఎంఆర్పీకి మించిన విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పాత్రికేయులు డిమాండ్ చేశారు.

వినతిపత్రాన్ని స్వీకరించిన ఎక్సైజ్ శాఖ ఎస్సై డి. వసంత మాట్లాడుతూ, ఎంఆర్పీకి మించి మద్యం విక్రయాలు, అక్రమ సరఫరా, సిండికేట్ తరహా కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు నిర్వహిస్తామని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సీహెచ్:

కారేపల్లిలో మద్యం విక్రయాలపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ చేపట్టే చర్యలపై ప్రజల్లో ఆసక్తి నెలకొంది.

# "స్టే అలర్ట్ -- స్టే అవేర్ -- స్టే సైబర్ సేఫ్"

# విద్యార్థులకు ఎస్ పి పిలుపు

**భద్రత న్యూస్ ములుగు జిల్లా**




తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "సురక్షా కా తిరంగా" కార్యక్రమంలో భాగంగా ములుగు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు మరియు కళాశాలలకు చెందిన సుమారు 600 మంది విద్యార్థులకు సైబర్ నేరాల నివారణపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామ్‌నాథ్ ఐపీఎస్ మాట్లాడుతూ నేటి డిజిటల్ యుగంలో ప్రతి ఒక్కరూ సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ముఖ్యంగా ఫిష మోసాలు, డీప్ ఫేక్ మోసాలు, డిజిటల్ అరెస్ట్ మోసాలు, సోషల్ మీడియా ఫేక్ ప్రొఫైల్ మోసాలు, పెట్టుబడి (ఇన్వెస్ట్‌మెంట్) మోసాలు, ఫేక్ లింక్స్ మోసాలు వంటి సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

అలాగే,తెలియని వ్యక్తులతో వ్యక్తిగత, బ్యాంకు, OTP, PIN వంటి వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని సూచించారు.

అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకుండా ముందుగా ధృవీకరించుకోవాలని తెలిపారు.

సోషల్ మీడియాలో వచ్చే ఫేక్ ప్రొఫైల్స్, డీప్ ఫేక్ వీడియోలు, అధిక లాభాల పేరుతో వచ్చే పెట్టుబడి ఆఫర్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని వివరించారు.

ఇన్‌స్టాగ్రామ్, ఫేసుబుక్ వంటి మాధ్యమాల్లో అపరిచిత వ్యక్తులతో పరిచయాలు పెంచుకొని మోసపోవద్దని సూచించారు. ఎవరైనా పోలీసుల పేరుతో ఫోన్ చేసి డబ్బులు లేదా వ్యక్తిగత వివరాలు అడిగితే నమ్మవద్దని, పోలీసులు ఫోన్ ద్వారా డబ్బులు అడగరని స్పష్టం చేశారు.సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 నేషనల్ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్కు కాల్ చేయాలని లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు.

ఈ సందర్భంగా విద్యార్థులు సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించుకొని, తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా ఈ సమాచారాన్ని చేరవేయాలని ఎస్పీ పిలుపునిచ్చారు.

ఎస్ పి గారు ప్రజలను ఉద్దేశిస్తూ "అప్రమత్తంగా ఉండండి -- అవగాహన పెంచుకోండి -- సైబర్ నేరాల నుండి సురక్షితంగా ఉండండి" అని విజ్ఞప్తి చేసారు.

ఈ కార్యక్రమంలో ములుగు డీఎస్పీ నలువాల రవీందర్, పస్రా సీఐ దయాకర్, ములుగు సీఐ దారం సురేష్, సీసీఎస్ సీఐ బందారి కుమార్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్, వెంకటాపూర్ ఎస్ఐ చల్లా రాజు, పస్రా ఎస్ఐ తాజుద్దీన్, ములుగు ఎస్ఐ వెంకటేష్ అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు



# దేవస్థానం నిర్మాణానికి ఇటుకలు విరాళం అందించిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్



**కారేపల్లి. ఆగస్టు 5(భద్రాద్రి న్యూస్):** మండలంలోని పొల్లంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని నాగయ్యగుంపు గ్రామంలో నిర్మాణంలో ఉన్న శ్రీ ఆంజనేయస్వామి ఆలయానికి వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ట్రాక్టర్ లోడు ఇటుకలను విరాళంగా అందించారు. గ్రామానికి చెందిన దారావత్ ముని నాయక్ విజ్ఞప్తి మేరకు ఆలయ నిర్మాణానికి ఒక ట్రాక్టర్ లోడు ఇటుకలు అవసరమని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి తన అనుచరుడు ఎస్.ఎన్. నాయక్ ద్వారా ఇటుకలను పంపించారు.

ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే అందించిన సహకారంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ రాందాస్ నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భూక్యా రాములుతో పాటు గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు అండగా నిలుస్తూ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే అందించిన సహాయం అభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు.

# బురదమయంగా మారిన మర్రిగూడెం ప్రధాన రహదారి బ్రిడ్జి







**అన్నపురెడ్డిపల్లి, (భద్రాద్రి న్యూస్) ఆగస్టు, 05.**
అన్నపురెడ్డిపల్లి మండలం మర్రిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో రహదారి పూర్తిగా దెబ్బతిని ప్రయాణికులకు నరకయాతన మిగులుతుంది. సీతారామ కాలువ బ్రిడ్జి ప్రాంతంలో రోడ్డుపై మట్టి కొట్టుకుపోయి పూర్తిగా బురదమయంగా మారింది. రోడ్డుపై ఏర్పడిన గుంతలు మట్టి, వర్షపు నీటితో నిండిపోయి కనిపించకుండా పోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.అటుగా వెళ్లే వాహనాలు గుంతల్లోని నీటిని నడిచి వెళ్లే పాదచారులపైకి చిమ్ముతుండటంతో వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గుంటల్లో నిలిచిన వర్షపు నీటి కారణంగా దుర్గంధం వెదజల్లుతోందని, గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య నిర్వహణ పూర్తిగా అస్తవ్యస్తంగా తాండవిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టి, పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# ఎస్ ఐ ఆర్ సవరణలో రాజకీయ పార్టీల సహకారం కీలకం



**భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్**
**మరణించిన, వలస వెళ్లిన, నివాసం మార్చుకున్న ఓటర్ల వివరాల ధృవీకరణకు సహకరించాలిలి**
**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 5 (భద్రాద్రి న్యూస్):–**
ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్)–2026 కార్యక్రమంలో రాజకీయ పార్టీల సహకారం అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. మరణించిన, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన, నివాసం మార్చుకున్న (షిఫ్ట్ అయిన) ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో ధృవీకరించి ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందించేందుకు సహకరించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు.
బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్)–2026 కార్యక్రమం పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణకు గడువు పొడిగించడంతో అదనపు సమయం లభించిందని, ఆ సమయాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుని మిగిలిన పనులను నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు నమోదైన పురోగతిని వివరిస్తూ, మొత్తం 9,96,198 మంది ఓటర్లకు సంబంధించి 8,60,051 ఎన్యూమరేషన్ ఫారాలు (86.33 శాతం) డిజిటైజ్ కాగా, 1,29,263 ఫారాలు (12.98 శాతం) అన్–కలెక్టబుల్‌గా నమోదయ్యాయని తెలిపారు. దీంతో డిజిటైజ్ చేసిన ఫారాలు, అన్–కలెక్టబుల్ ఫారాలు కలిపి మొత్తం 9,89,314 ఫారాల ప్రక్రియ పూర్తై జిల్లా 99.31 శాతం పురోగతి సాధించిందన్నారు. ప్రస్తుతం కేవలం 6,884 ఫారాలు (0.69 శాతం) మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కూడా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.
మ్యాపింగ్ పూర్తయిన ఓటర్ల వివరాలు నేరుగా ముసాయిదా (డ్రాఫ్ట్) ఓటరు జాబితాలో చేరుతాయని తెలిపారు. ఆన్‌మ్యాప్డ్ కేసులను ప్రత్యేకంగా పరిశీలించాలని, రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ పరిధిలో మరణించిన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు, నివాసాన్ని మార్చుకున్న ఓటర్ల వివరాలను ధృవీకరించి సంబంధిత ఆధారాలతో ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందించేందుకు రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.
ఏఎస్‌డీ, డీఎస్ఈ జాబితాలను మరోసారి పరిశీలించి ఏవైనా అభ్యంతరాలు లేదా లోపాలు ఉంటే తెలియజేయాలని సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ ప్రక్రియ పూర్తిస్థాయిలో జరిగిందో లేదో రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా పరిశీలించాలని, అవసరమైతే రీ–వెరిఫికేషన్ నిర్వహించి లోపాలను సరిదిద్దేందుకు సహకరించాలని కోరారు.
పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్, రీ–అరేంజ్‌మెంట్ ప్రక్రియను కూడా గడువులోగా పూర్తి చేయాల్సి ఉందని కలెక్టర్ తెలిపారు. పాత, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో కొనసాగుతున్న పోలింగ్ కేంద్రాలకు బదులుగా కొత్త భవనాలు అందుబాటులో ఉంటే వెంటనే సమాచారం అందించాలని, పాఠశాల పేరు లేదా భవనం మారిన సందర్భాల్లో సంబంధిత ప్రతిపాదనలు పంపాలని కోరారు. అలాగే 1,200 మందికి పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలు లేదా జనాభా మార్పులు అధికంగా ఉన్న ప్రాంతాలను రేషనలైజేషన్ కోసం ప్రతిపాదించాలని సూచించారు.
ప్రత్యేక ఓటరు జాబితా సవరణ--2026 కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం జిల్లాలో పకడ్బందీగా నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. జూన్ 25 నుంచి ఆగస్టు 10 వరకు బీఎల్‌వోలు ఇంటింటి సందర్శనలు నిర్వహించి ఓటర్ల వివరాలను ధృవీకరిస్తుండగా, ఆగస్టు 10లోగా పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ, పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ పూర్తవుతుందని చెప్పారు. ఆగస్టు 17న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు, అదే రోజు నుంచి సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరిస్తారని తెలిపారు. ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలపై విచారణ, పరిష్కార ప్రక్రియ చేపట్టి, అక్టోబర్ 19న తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు వెల్లడించారు.
ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్‌కు అనుగుణంగా అన్ని రాజకీయ పార్టీలు సమన్వయంతో పనిచేసి, ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, విజయవంతంగా పూర్తి చేసేందుకు సహకరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ కోరారు.
ఈ సమావేశంలో ఎన్నికల విభాగం సూపర్డెంట్ రంగ ప్రసాద్, ఎన్నికల విభాగం సిబ్బంది నవీన్,కాంగ్రెస్ పార్టీ శ్రీనివాసరెడ్డి, బిజెపి అండ్ కృష్ణ, శివ, ఆమ్ ఆద్మీ పార్టీ రాంబాబు, సిపిఐ బాలరాజు ఇతర గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రైతు సమస్యలు పరిష్కరించాలి

## డిప్యూటీ తహసీల్దార్‌కు అఖిలభారత ఐక్య రైతు సంఘం వినతి



**సింగరేణి, ఆగస్టు 5 (భద్రాద్రి న్యూస్):**
రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించి, నష్టపోయిన వారికి ప్రభుత్వం అండగా నిలవాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం డిమాండ్ చేసింది. సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ అనుబంధ అఖిలభారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సింగరేణి మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మండల డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.
ఈ సందర్భంగా సంఘం డివిజన్ నాయకుడు గుగులోతు తేజ నాయక్ మాట్లాడుతూ, ప్రభుత్వం, వాతావరణ శాఖ ప్రకటనలను నమ్మి ఖరీఫ్ సాగు ప్రారంభించిన రైతులకు ఆశించిన మేర వర్షాలు కురవకపోవడంతో విత్తిన విత్తనాలు మొలకెత్తకుండా ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.
నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం అందించాలని, స్వల్పకాలిక పంటల విత్తనాలు, ఎరువులు ఉచితంగా పంపిణీ చేయాలని, రైతుల పాత రుణాలను పూర్తిగా మాఫీ చేసి వడ్డీలేని కొత్త పంట రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని పంటలకు బీమా వర్తింపజేయడంతో పాటు గ్రామాల్లో పశుగ్రాసం, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఎండిపోతున్న పంటలకు ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందించాలని, పోడు సాగులో అటవీ శాఖ అధికారుల ఆటంకాలను తొలగించి పట్టా పోడు భూముల్లో ట్రాక్టర్లతో సాగు చేసుకునేందుకు ఎలాంటి ఆంక్షలు లేకుండా అనుమతించాలని ప్రభుత్వాన్ని కోరారు.
వినతిపత్రం సమర్పించిన వారిలో అఖిలభారత ఐక్య రైతు సంఘం డివిజన్ కమిటీ అధ్యక్షుడు పులకని సత్తిరెడ్డి, డివిజన్ నాయకుడు వడ్డే వెంకటేశ్వర్లు, అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం డివిజన్ కమిటీ సభ్యుడు రావుల నాగేశ్వరరావు, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ సింగరేణి మండల నాయకుడు బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# అభ్యర్థులకు వరం ఎస్టీయూ టెట్ మెటీరియల్

## ఉపాధ్యాయ సంఘాల సేవలు అభినందనీయం




**కోదాడ, ఆగస్టు 5(భద్రాద్రి న్యూస్):**
డీఎస్సీ, టెట్ అభ్యర్థులకు చేయూతనందించేలా ఎస్టీయూ సంఘం ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ మెటీరియల్‌ను అత్యంత తక్కువ ధరకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని పలు మండలాల ఎంఈఓలు కొనియాడారు. బుధవారం కోదాడ పట్టణంలోని బాయ్స్ హై స్కూల్ నందు రూ. 3 వేల విలువైన మెటీరియల్‌ను రూ. 500లకే అందించడాన్ని స్వాగతిస్తూ కోదాడ, చిలుకూరు, అనంతగిరి, మునగాల, నడిగూడెం మండలాల ఎంఈఓలు సలీం షరీఫ్, జి. శివకుమారి, తల్లాడ శ్రీనివాస్, పిడతల వెంకటేశ్వర్లు, వనం సత్యనారాయణ, హెచ్ఎం డి. వెంకటేశ్వర్లు మెటీరియల్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు బంధం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పోరాటంతో పాటు సామాజిక బాధ్యతగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. టెట్ మెటీరియల్ రూపకల్పనకు సహకరించిన రిసోర్స్ పర్సన్లు, రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి సదానంద గౌడ్, జుట్టు గజేందర్ లకు ఎస్టీయూ సూర్యాపేట జిల్లా శాఖ పక్షాన ధన్యవాదములు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా ఎస్ టి యు అదనపు ప్రధాన కార్యదర్శి బి రామచంద్ర రెడ్డి, జిల్లా నాయకులు యలగొండ శ్రీనివాస్, కంచు గంటి వెంకటేశ్వర్లు వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు సత్తూరి బిక్షం, సుదర్శన్, సాదే సురేష్, పుట్టపాక నరసింహారావు, బెజవాడ శ్రీనివాస్, మంద పుల్లయ్య, చౌడిశెట్టి శ్రీనివాస్, ఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి






**భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్**

**పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందించాలి**

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 5 (భద్రాద్రిన్యూస్ ):** జిల్లాలో ఎస్సీ, ఎస్టీ చట్టం కింద నమోదైన కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రోహిత్ రాజుతో కలిసి నిర్వహించిన జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల నమోదులు, దర్యాప్తు, చార్జిషీట్ల దాఖలు, కోర్టు విచారణ, బాధితులకు పరిహారం చెల్లింపులు, పునరావాస చర్యలు, పెండింగ్ కేసుల పురోగతి తదితర అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.

జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడం రాష్ట్ర ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యత అంశమని అన్నారు. 2014 నుంచి 2026 జూలై వరకు జిల్లాలో మొత్తం 1,104 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయని, వీటిలో 196 కేసులు తప్పుడు కేసులు గా తేలగా, 908 కేసులు నిజమైనవిగా నిర్ధారణ అయ్యాయని తెలిపారు. 859 కేసుల్లో చార్జిషీట్లు దాఖలు చేయగా, 12 కేసుల్లో శిక్షలు నమోదయ్యాయని, 373 కేసుల్లో నిందితులు నిర్దోషులుగా విడుదల కాగా, 472 కేసులు కోర్టు విచారణ దశలో ఉన్నాయని చెప్పారు. ప్రస్తుతం 49 కేసులు దర్యాప్తు దశలో కొనసాగుతున్నాయని తెలిపారు .

దర్యాప్తులో ఉన్న ప్రతి కేసును నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేసి చట్టపరమైన గడువులోపు చార్జిషీట్లు దాఖలు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. కేసుల విచారణలో నిర్లక్ష్యానికి తావులేకుండా బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం కల్పించే ఆర్థిక సహాయం, పునరావాసం, న్యాయ సహాయం, రక్షణ తదితర సంక్షేమ ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

కేసుల పురోగతిని నిరంతరం సమీక్షిస్తూ పెండింగ్ కేసులను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని, బాధితుల గోప్యత, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. గ్రామ, మండల స్థాయిలో ఎస్సీ, ఎస్టీ హక్కులు, అత్యాచారాల నిరోధక చట్టంపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా సమాజంలో చైతన్యం పెంపొందించాలని అధికారులను ఆదేశించారు.

జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రోహిత్ రాజు మాట్లాడుతూ , ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తును నిరంతరం పర్యవేక్షిస్తూ పెండింగ్ కేసులను వేగంగా పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. 2016 నుంచి అమలులో ఉన్న మూడు దశల పరిహార విధానం ప్రకారం, ఎఫ్ఐఆర్ నమోదైన 949 కేసుల్లో 928 కేసులకు జిల్లా కలెక్టర్ ఆమోదం లభించగా, 823 కేసులకు పరిహారం మంజూరైందని, 105 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. చార్జిషీట్లు దాఖలైన 702 కేసుల్లో 580 కేసులకు పరిహారం మంజూరైందని, 122 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, కోర్టు తీర్పు వెలువడిన 7 కేసులకు సంబంధించి అన్ని 7 కేసుల్లోనూ పరిహారం పూర్తిగా చెల్లించినట్లు వివరించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులతో పాటు పోక్సో కేసులను కూడా అత్యంత ప్రాధాన్యతతో దర్యాప్తు చేస్తూ బాధిత చిన్నారులకు అవసరమైన వైద్య, న్యాయ, కౌన్సెలింగ్ సేవలు అందిస్తున్నామని తెలిపారు. గ్రామాలు, పాఠశాలలు, కళాశాలలు, ప్రజా వేదికలలో ఎస్సీ, ఎస్టీ హక్కులు, పోక్సో చట్టం, మహిళలు, బాలల రక్షణ, సైబర్ నేరాల నివారణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు . సైబర్ మోసాలకు గురైన ప్రజలు వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌ను ఫిర్యాదు చేయడంతో పాటు సమీప పోలీసు స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, కొత్తగూడెం ఆర్ డి ఓ మధు, జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి శ్రీలత, జిల్లా వైద్యశాఖ అధికారి తుకారాం రాథోడ్,సంబంధిత శాఖల జిల్లా అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ , జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సామ్యా నాయక్, లకావత్ వెంకటేశ్వర్లు, లక్ష్మీ రాంబాయి, కోలూరి రామ్మూర్తి పాల్గొన్నారు.

# హామీలు ఎక్కడ..?

**వద్దిపేట చెక్ డ్యాం, డిగ్రీ కళాశాల వెంటనే మంజూరు చేయాలి**

**ఆదివాసీల సమస్యలు పరిష్కరించి.. కూరగడ్డ భూములకు నష్టపరిహారం చెల్లించాలి: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ**



**చర్ల, ఆగస్టు 5 (భద్రాద్రి న్యూస్):** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, ముఖ్యంగా చర్ల మండలంలోని వద్దిపేట చెక్ డ్యాం నిర్మాణంతో పాటు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూరు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ ముసలి సతీష్ డిమాండ్ చేశారు.

బుధవారం ఆయన మాట్లాడుతూ, తాలిపేరు ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా ప్రస్తుతం ఒక పంటకే సాగునీరు అందుతోందని తెలిపారు. ఎన్నికలకు ముందు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వద్దిపేట చెక్ డ్యాం నిర్మించి, ఎత్తిపోతల పథకం ద్వారా 25 వేల ఎకరాలకు రెండు పంటలకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ హామీని ప్రభుత్వం తప్పకుండా నిలబెట్టుకోవాలని కోరారు.

వద్దిపేట చెక్ డ్యాం నిర్మాణం పూర్తయితే ఎత్తిపోతల పథకం ద్వారా సుమారు 25 వేల ఎకరాలకు సాగునీరు అందడంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, వ్యవసాయ కూలీలకు కూడా ఏడాది పొడవునా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు ఉన్నత విద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, దీంతో ఆర్థికంగా, విద్యాపరంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ పార్టీ ఏజెన్సీ ప్రజలకు, ఆదివాసీలకు అనేక హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించిందని విమర్శించారు.

సీతారామ ప్రాజెక్టు కారణంగా సుమారు 10 వేల ఎకరాల కూరగడ్డ భూములు నీట మునిగే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. కొత్తపల్లి, లింగాపురం, గొంపల్లి, కొత్తూరు, మొగలపల్లి, ఆనందకాలనీ తదితర ఏడు గ్రామాల ప్రజలు తరతరాలుగా ఈ భూములపైనే ఆధారపడి జీవిస్తున్నారని పేర్కొన్నారు. బాధిత రైతులకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

అలాగే కొయ్యూరు, మామిడిగూడెం, గద్దరుగట్టు ప్రాంతాల్లో ఆదివాసీల భూములను అటవీ శాఖ ఆక్రమిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆదివాసీల హక్కులను పరిరక్షించాల్సిన చట్టాలను ఉల్లంఘిస్తూ వారిపైనే అక్రమ కేసులు నమోదు చేయడం దురదృష్టకరమని అన్నారు. పాత పోడు భూములను సాగు చేస్తున్న రైతులకు పట్టాలు మంజూరు చేయాలని, ఆదివాసీలపై నమోదు చేసిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఏఐటీఎఫ్ (ఆల్ ఇండియా ట్రైబల్ ఫోరం) జిల్లా నాయకులు గొంది మూయన్న, ఇరుప ప్రసాద్, బొర్రా సరోజిని, కొండ్రు రాజేశ్వరి, బంద నాగమణి, తెల్లం బుచ్చయ్య, తెల్లం రామకృష్ణ, తెల్లం కమల తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలకు చెక్... అవగాహనే మహా ఆయుధం!





**చర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలీసుల సైబర్ భద్రత సదస్సు**

**ఓటీపీ, బ్యాంకు వివరాలు పంచుకుంటే ఖాతా ఖాళీ.. విద్యార్థులకు డీఎస్పీ హెచ్చరిక**




**చర్ల, ఆగస్టు 5 భద్రాద్రి న్యూస్**

దేశవ్యాప్తంగా సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో యువత అప్రమత్తంగా ఉండాలనే ఉద్దేశంతో సురక్షక్ తిరంగా కార్యక్రమంలో భాగంగా చర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం సైబర్ భద్రతపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. పోలీస్ శాఖ, విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు సైబర్ మోసాలపై విలువైన సూచనలు అందించారు. ఈ సందర్భంగా.

భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. గుర్తు తెలియని వ్యక్తులకు ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం పిన్, సీవీవీ వంటి గోప్యమైన సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించవద్దని హెచ్చరించారు. సోషల్ మీడియా ద్వారా వచ్చే నకిలీ లింకులు, ఫేక్ యాప్‌లు, ఆన్‌లైన్ ఉద్యోగాలు, పెట్టుబడుల పేరుతో వచ్చే ఆఫర్లు, లాటరీ సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిన్న నిర్లక్ష్యమే పెద్ద ఆర్థిక నష్టానికి దారితీస్తుందని విద్యార్థులకు వివరించారు.

చర్ల, సీఐ రాజు వర్మ మాట్లాడుతూ.. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని, అలాగే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. సకాలంలో ఫిర్యాదు చేస్తే డబ్బు తిరిగి పొందే అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. సైబర్ నేరాలను అరికట్టడంలో ప్రజల అప్రమత్తతే అత్యంత ప్రభావవంతమైన ఆయుధమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు పి. కేశవ్, ఆర్. నర్సిరెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నరేందర్, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్రామీణ పారిశుద్ధ్య సేవల బలోపేతానికి కేంద్ర బృందం అధ్యయనం





**రెండు రోజుల పాటు ములుగు జిల్లాలో క్షేత్రస్థాయి పరిశీలన.**

**: జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**

**భద్రాద్రి న్యూస్ ములుగు**

గ్రామీణ పారిశుద్ధ్య సేవల బలోపేతానికి కేంద్ర బృందం ములుగు జిల్లా లోని చల్వాయి, మేడారం గ్రామాలలో రెండు రోజుల పాటు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తుందని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు.

బుధవారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తన ఛాంబర్ లో స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ కింద గ్రామీణ పారిశుద్ధ్య ఆస్తులు, సేవల నిర్వహణకు భవిష్యత్తులో అవసరమయ్యే నిధుల అంచనపై అధ్యయనం నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్ గ్రోత్ బృందం, యూనిసెఫ్ ప్రతినిధులు సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య సేవలను మరింత బలోపేతం చేయడానికి ఇటువంటి అధ్యయనాలు దోహదపడతాయని తెలిపారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం అధ్యయన నివేదికను సమర్పించాలని బృందాన్ని కోరారు. సంబంధిత శాఖల సమన్వయంతో అధ్యయన బృందానికి అవసరమైన సహకారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

భారత ప్రభుత్వ జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో యూనిసెఫ్ సహకారంతో ఈ అధ్యయనం నిర్వహించబడుతోంది. గ్రామీణ పారిశుద్ధ్య మౌలిక సదుపాయాల నిర్వహణ, నిర్వహణ వ్యయాలు, భవిష్యత్ నిధుల అవసరాలను అంచనా వేయడం ఈ అధ్యయనం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

దేశవ్యాప్తంగా తెలంగాణ, అసోం, గుజరాత్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఈ అధ్యయనం చేపట్టనుండగా, తెలంగాణలో ములుగు, నారాయణపేట జిల్లాలను ఎంపిక చేశారు. ములుగు జిల్లాలో చల్వాయి, మేడారం గ్రామ పంచాయతీలను అధ్యయనం కోసం గుర్తించినట్లు తెలిపారు.

ఆగస్టు 5, 6 తేదీల్లో రెండు రోజుల పాటు కేంద్ర బృందం జిల్లాలో పర్యటించి గ్రామీణ పారిశుద్ధ్య సేవలు, మౌలిక సదుపాయాల నిర్వహణపై క్షేత్రస్థాయిలో అధ్యయనం నిర్వహించనుంది.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్‌రావు, కేంద్ర ఐఈజీ బృంద సభ్యులు డాక్టర్ నితీష్ ఖన్నా, అనుకేత్, యూనిసెఫ్ రాష్ట్ర సమన్వయకర్త శ్రీహరి నక్క, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జి. రవీందర్, జిల్లా పంచాయతీ అధికారి కె. వెంకయ్య, ఏడీపీ ఎం. వెంకటనారాయణ, స్వచ్ఛ భారత్ మిషన్ కన్సల్టెంట్లు మైమున్నిస్సా, షర్పున్నిస్సా తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ ఐ ఆర్ ప్రక్రియను నిష్పాక్షికంగా నిర్వహించాలి

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**



**భద్రాద్రి న్యూస్ ములుగు**



భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని నిష్పాక్షికంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ములుగు నియోజకవర్గంలో ప్రస్తుతం 303 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. వీటిలో రెండు పోలింగ్ కేంద్రాలను స్థల మార్పు చేయనున్నట్లు, నాలుగు పోలింగ్ కేంద్రాల పేర్లను మార్చనున్నట్లు, మరో ఐదు నూతన పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. దీంతో నియోజకవర్గంలో మొత్తం 308 పోలింగ్ కేంద్రాలు ఓటర్లకు అందుబాటులో ఉండనున్నాయని తెలిపారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, ఓటర్ల సంఖ్య, అందుబాటులో లేని ఓటర్ల వివరాలు తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు పూర్తి సమాచారం అందించినట్లు కలెక్టర్ తెలిపారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో రాజకీయ పార్టీల సహకారం ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఎస్ఐఆర్--2026 ప్రక్రియకు సంబంధించి ఇప్పటి వరకు ఏ రాజకీయ పార్టీ నుంచి కూడా ఎలాంటి అభ్యంతరాలు అందలేదని తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ప్రతి దశను నిబంధనలకు అనుగుణంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ సూచనలు, సలహాలను ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకురావాలని, ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు.

ఈ సమావేశంలో ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీఓ కె. కృష్ణవేణి, ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద సత్సంగం







**వెంకటేశ్వర స్వామి ఆలయ వద్ద బుధవారంవికాస తరంగిణి బృందం తో శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రం పారాయణ గోష్టి తదనంతరం గోష్టి బృందంతో సత్సంగం నిర్వహించారు. అదేవిధంగా వికాస్ తరంగణి బృందంతో శోభాయాత్ర గా వెంకటాపురం మండలంలో గల శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయం వద్దకు మరియు శ్రీ ఉమా రామ లింగేశ్వర స్వామి వారి ఆలయం వద్దకు శ్రీరామ హృదయ కలశం తీసుకొని వెళ్లారు**

## జూకల్ లో పోలీసుల 'కార్డన్ అండ్ సెర్చ్' ఆపరేషన్

**20 ద్విచక్ర వాహనాలకు ఫైన్**

**లిఐదు లీటర్ల గుడుంబా పట్టివేత కేసు నమోదు.**

**చిట్యాల, భద్రాద్రి న్యూస్**



మండలంలోని జూకల్ గ్రామంలో జిల్లా ఎస్పీ సిరి శెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు సీఐ డి. మల్లేష్ ఆధ్వర్యంలో బుధవారం గ్రామంలో పోలీసులు ముమ్మరంగా 'కార్డన్ అండ్ సెర్చ్' ఆపరేషన్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా గ్రామంలోని ప్రతి ఇంటిని, వీధులను పోలీసులు క్షుణ్ణంగా సోదా చేశారు. సోదాల సమయంలో పొనగంటి చంద్రయ్య అనే వ్యక్తి వద్ద 5 లీటర్ల అక్రమ గుడుంబా దొరకడంతో అతనిపై కేసు నమోదు చేసినట్లు చిట్యాల ఎస్సై పోచంపల్లి సతీష్ తెలిపారు. అలాగే సరైన పత్రాలు లేని 20 వాహనాలపై ఫైన్ విధించారు. ఈ సందర్భంగా సీఐ డి. మల్లేష్ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ, ప్రమాదాలను అరికట్టాలని పేర్కొన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, సన్మార్గంలో పయనించాలని హితవు పలికారు. అలాగే తెలంగాణ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన పోలీస్ ఉద్యోగాల నియామకాల కోసం జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ అందిస్తున్నామని తెలిపారు. గ్రామంలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చిట్యాల ఎస్సై పోచంపల్లి సతీష్, ఎస్సై-2 రాజన్ కుమార్, ఏఎస్సై ఈశ్వరయ్య, 20 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.